

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మండలాల స్థాయిలోనూ జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ అన్నారు. -8లో



రూ.1600 కోట్లతో అభివృద్ధి

వైఎస్ జగన్ పాలనలో రైల్వేకోడూరు నియోజకవర్గంలో రూ.1600 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.250	రూ.320
రెండోరకం	రూ.150	రూ.248



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 383 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	365	416
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 192.620 కిలోలు

న్యూస్‌రీల్

8న మున్నార్‌కు స్పెషల్ బస్సు

మదనపల్లె సిటీ: కేరళలోని మున్నార్‌కు డిసెంబర్ 8న స్పెషల్ బస్సు నడపనున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. 8న సాయంత్రం 6 గంటలకు మదనపల్లెలో బయలుదేరుతుందన్నారు. మున్నార్‌లోని ప్రదేశాలు, ఎరవికులం నేషనల్ పార్కు, అతిరపిల్లి వాటర్‌ఫాల్స్ (బాహుబలి వాటర్‌ఫాల్స్), ఈశా టెంపుల్, లేజర్‌షో చూపించనున్నట్లు చెప్పారు. తిరిగి 11న ఉదయం బస్సు మదనపల్లెకు చేరుతుందన్నారు. పర్యాటకులు రాను,పోను చార్జి రూ.3,000 చెల్లించాలన్నారు. టిక్కెట్ల కోసం 9959225677, 9160186645, 90009 35897 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

హోంగార్డుల సంక్షేమానికి చర్యలు



హోంగార్డులకు గుర్తింపు కార్డులను అందజేస్తున్న కమాండెంట్ మహేష్ కుమార్

రాయచోటి: హోంగార్డుల సంక్షేమానికి పోలీస్‌శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమాండెంట్ మహేష్ కుమార్ అన్నారు. బుధవారం అన్నమయ్య జిల్లా, రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో హోంగార్డులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. జిల్లా ఎస్పీ బి కృష్ణారావు, వెల్ఫేర్ ఫండ్ నుంచి విడుదల చేసిన నిధులతో గుర్తింపు కార్డులను ముద్రించి ఇచ్చినట్లు కమాండెంట్ మహేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హోంగార్డు ఇన్‌చార్జి గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అరక్కోణం ప్యాసింజర్ రద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప–అరక్కోణం–కడప మధ్య నడుస్తున్న అరక్కోణం ప్యాసింజర్ రైలును మరో వారం రోజులపాటు రద్దు చేసినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. డిసెంబరు 4 నుంచి 10వ తేదీ వరకు రద్దు చేశారన్నారు.

- కడప మీదుగా నడిచే రామేశ్వరం–ఓకా ఎక్స్‌ప్రెస్, మధురై–ఓకా ఎక్స్‌ప్రెస్‌లను డిసెంబరు 8, 15 తేదీల్లో కాట్పాడి, పాకాల, ధర్మవరం, గుత్తి మీదుగా దారి మళ్లించారన్నారు. ఈ రెండు రైళ్లు ఆయా తేదీల్లో కడప మీదుగా నడవవని, ప్రయాణికులు గమనించాలని కోరారు.

15న సర్పంచ్‌ల సదస్సు

కడప సెవెన్‌రోడ్స్: రాయలసీమ జిల్లాల సర్పంచ్‌ల సదస్సు డిసెంబరు 15వ తేదీ కడప నగరంలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ ఉపాధ్యక్షులు కె.మునిరెడ్డి, సింగంశెట్టి సుబ్బరామయ్యలు తెలిపారు. బుధవారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. సర్పంచ్‌లతోపాటు మాజీ సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు సదస్సుకు హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లాలోని పది నియోజకవర్గాలకు సంబంధించిన ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు వైబీవీ రాజేంద్రప్రసాద్, వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు తదితర నాయకులు హాజరు కానున్నట్లు వివరించారు.

వెల్లాల దేవస్థానానికి రూ.5.44లక్షల ఆదాయం

రాజుపాళెం: రాజుపాళెం మండలంలోని వెల్లాల శ్రీ చెన్నకేశవ సంజీవరాయ, భీమలింగేశ్వరస్వాముల ఆలయాలకు సంబంధించి టెంకాయల అంగడి ఏర్పాటు చేసుకునేందుకు జరిగిన వేలం పాటలో రూ.5,44,800 ఆదాయం వచ్చినట్లు ఈఓ బీవీ నరసయ్య తెలిపారు. ఆలయ పర్యవేక్షణ అధికారి ఆర్‌ఆర్ నరసింహాసింగ్, ఈఓ బీవీ నరసయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు బలరామిరెడ్డి ఆధ్వర్యంలో వేలం పాటను ప్రారంభించారు. ఇందులో ఆళ్లగడ్డకు చెందిన రవీంద్రాచారి రూ.5,44,800 పాట పాడి దక్కించుకున్నారు.

నిత్యాన్నదానానికి వితరణ



దాత కుటుంబ సభ్యులకు తీర్థ ప్రసాదాలను అందిస్తున్న ఆలయ ఈఓ అలవలపాటి ముకుందారెడ్డి

చక్రాయపేట: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి కడప నగరం చిన్నచౌకు రెడ్డి కాలనీకి చెందిన రైల్వే కాంట్రాక్టర్ బండి పిచ్చిరెడ్డి, విజయ, కుటుంబ సభ్యులు రూ.1,00,116ల విరాళాన్ని అందించారు. దాత కుటుంబ సభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించారు. తీర్థ, ప్రసాదాలు, స్వామివారి చిత్ర పటం, శేష వస్త్రంతో వేద ఆశీర్వచనం చేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు.

ఆటాడుకుందాం..రా!

- జిల్లాలో ఆడుదాం ఆంధ్ర కింద ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు
- డిసెంబరు 15 నుంచి ఫిబ్రవరి 3 వరకు క్రీడా పోటీలు



రాయచోటి నేతాజీ సర్కిల్ సమీపంలోని పాఠశాల మైదానం

సాక్షి రాయచోటి: ప్రతి ఒక్కరికీ మానసిక ఉల్లాసం నింపడంతోపాటు వ్యాయామం ద్వారా మనిషి ఆరోగ్యానికి భరోసా ఇవ్వాలన్న సంకల్పంతో వైఎస్ జగన్ సర్కార్ ఆడుదాం ఆంధ్రకు శ్రీకారం చుట్టింది. యువతలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి అత్యుత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా 15 సంవత్సరాలు నిండిన పురుషులు, మహిళలు ఎవరైనా క్రీడాంశాల్లో పాల్గొనేలా రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించింది. జిల్లా వ్యాప్తంగా మంగళవారం క్రీడాకారుల రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించగా, ఇప్పటికే 50 జట్లకు పైగా రిజిస్ట్రేషన్లు నమోదు చేసుకున్నాయి.

ఐదు క్రీడాంశాల్లో అవకాశం

అన్నమయ్య జిల్లాలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం కింద ఐదు విభాగాల్లో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ అవకాశం కల్పిస్తోంది. ప్రధానంగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. అందుకు సంబంధించి ఈ క్రీడలకు సంబంధించి ఆసక్తి ఉన్న వారిని ఆడుదాం ఆంధ్ర ఆహ్వానం పలుకుతోంది.

వచ్చేనెల 15 నుంచి క్రీడాపోటీలు

అన్నమయ్య జిల్లాలో ఆడుదాం ఆంధ్ర కింద క్రీడా పోటీలు డిసెంబరు 15 నుంచి ప్రారంభం కానున్నాయి. దాదాపు నెలన్నర రోజుల పాటు మ్యాచ్‌లతో అన్నిచోట్ల కొత్త సందడి నెలకొంది. తొలుత సచివాలయ పరిధిలో పోటీలు నిర్వహిస్తారు. తర్వాత నియోజకవర్గం, ఆ తర్వాత జిల్లా స్థాయి, తదనంతరం రాష్ట్ర స్థాయిలో పోటీల నిర్వహణకు చర్యలు చేపట్టారు.

సిద్ధమవుతున్న మైదానాలు

జిల్లాలోని 30 మండలాల పరిధిలోని 501 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. క్రీడాకారులకు అందుబాటులో ఉన్న మండల, నియోజక, జిల్లా కేంద్రాల్లో ఉన్న మైదానాలను తీసుకుని క్రీడలకు సిద్ధం చేస్తున్నారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వసతుల కల్పనకు నడుం బిగించారు. జిల్లా అధికారులు పౌరసరఫరాలు, రవాణా, రెవెన్యూ, పోలీసు, క్రీడలు, మున్సిపల్ తదితర శాఖలను సమన్వయం చేసుకుంటూ పోటీలను నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆటలకు సంబంధించి అంపైర్లకుగాను 255 మంది పీఈటీలు, పీడీలు, 100 మంది సీనియర్ క్రీడాకారులను కలుపుకుని 355 మందిని క్రీడలకు ఉపయోగించుకునేలా ప్రణాళికలు రూపొందించారు.

ప్రతిష్ఠాత్మకంగా ఆడుదాం ఆంధ్ర క్రీడలు

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలపట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. అందులో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువ క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. 15 ఏళ్లు నిండిన వారెవరైనా క్రీడల్లో పాల్గొనవచ్చు. జిల్లాలో ఐదు విభాగాల్లో నిర్వహించే ఆడుదాం ఆంధ్ర పోటీలకు జిల్లా వ్యాప్తంగా మైదానాలు సిద్ధం చేశాం.ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనేందుకు ముందుకు రావాలి. ఈనెల 28 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది.

– పీఎస్ గిరీషా, కలెక్టర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా



క్రికెట్ ఆడేందుకు వెళుతున్న కలెక్టర్ పీఎస్ గిరీషా (ఫైల్)

పారిశ్రామిక రంగ అభివృద్ధికి పెద్దపీట

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. బుధవారం తాడేపల్లెలోని క్యాంపు కార్యాలయం నుంచి అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం, తాటిగుంటపల్లి గ్రామంలో రూ. 15.92 కోట్ల అంచనాతో 89.72 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్న నూతన పారిశ్రామిక రంగానికి బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, డీఆర్‌ఓ సత్యనారాయణ, జిల్లా పరిశ్రమలశాఖ ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ ఏ విజయలక్ష్మీ, ఏపీఐఐసీ మేనేజర్ ఎం ఉదయ్ కుమార్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వర్చువల్ సమావేశం అనంతరం వాల్మీకిపురం మండలం, తాటిగుంటపల్లి గ్రామంలో ఏర్పాటు చేయనున్న నూతన పారిశ్రామిక వాడ శిలాఫలకాన్ని డీఆర్‌ఓ, జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహంతో పారిశ్రామిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. రాష్ట్ర పారిశ్రామిక మౌళిక సదుపాయాల కార్పొరేషన్ ద్వారా సూక్ష్మ, చిన్న సంస్థల క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం క్రింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో వాల్మీకిపురం మండలం, తాటిగుంటపల్లి గ్రామంలో ఏర్పాటు చేయనున్న నూతన పారిశ్రామిక వాడలో వివిధకంపెనీల స్థాపనకు 89 ప్లాట్స్ అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు.ఈ పారిశ్రామిక వాడలో రూ.15.92 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. పరిశ్రమలను ప్రోత్సహించడంలో భాగంగా జిల్లాలో ఇప్పటికే బి కొత్తకోటలో టమాటా ప్రాసెసింగ్ యూనిట్, పీలేరు మండలంలో గూడరేవులపల్లిలో సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపించినట్లు చెప్పారు. జిల్లాలో నూతన పరిశ్రమలను స్థాపించేందుకు అధికారులు పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించాలి

జిల్లాలో వంద శాతం తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించడమే లక్ష్యం కావాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఓటరు జాబితా సవరణపై ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో కలెక్టర్ వీడి యో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఫామ్స్ పెండింగ్ స్పీడ్‌గా జరగలేదన్నారు. 7 డేస్ పెండెన్సీ ఫామ్స్ 8వ రోజుకు పోకుండా క్లియర్ చేయాలన్నారు.

- 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఇందుకోసం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌తో సమావేశం నిర్వహించి 18 సంవత్సరాలు నిండి వారు ఇంకా ఓటర్‌గా నమోదు కాకపోతే అలాంటి వారికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఓటర్‌గా నమోదు చేయించాలన్నారు.
- రాబోయే ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి ఎన్నికల నిర్వహణ అధికారులు విధులు నిర్వహించాలన్నారు.



వాల్మీకిపురం మండలం, తాటిగుంటపల్లెలో ఏర్పాటు చేయనున్న నూతన పారిశ్రామిక వాడ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్ తదితరులు

పెద్దదర్గాలో ఉట్టిపడుతున్న ఉరుసు శోభ



ఖవ్వాలీ గానం చేస్తున్న కళాకారులు



ఖవ్వాలీ కచేరీకి హాజరైన పీఠాధిపతి

కడప కల్చరల్: ప్రముఖ ఆధ్యాత్మిక సూఫీ పుణ్యక్షేత్రం కడప అమీన్‌పీర్ (పెద్ద) దర్గా ఉరుసు ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగోరోజు బుధవారం దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆధ్వర్యంలో దర్గా ప్రాంగణంలో శిష్యులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాత్రి ముషాయిరా హాలులో ప్రముఖ గాయకులతో ఖవ్వాలీ కచేరీ నిర్వహించారు. గాయకులు ఒకరినొకరు పోటీలు పడి మహా ప్రవక్త గుణగణాల గురించి గానం చేస్తుండగా భక్తులు తన్మయులై ఆలకించారు.దర్గా ప్రాంగణం రంగురంగుల విద్యుద్దీపాలతో మెరిసిపోతోంది. స్థానికులే కాకుండా బయటి ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దర్గా నిర్వాహకులు లంగర్‌లో బయటి ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు.

నేడు కడపకు సీఎం వైఎస్ జగన్ రాక



కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం కడప నగరానికి వస్తున్నారు. ఆధ్యాత్మిక క్షేత్రమైన పెద్దదర్గా ఉరుసు ఉత్సవాల్లో ఆయన పాల్గొంటారు. ఈ సందర్భంగా దర్గా గురువుల మజార్లకు చాదర్ సమర్పించనున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాల జిల్లా అవుకు మండలం మెట్టుపల్లె హెలిప్యాడ్ నుంచి మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరి 1.30 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 1.40 గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 1.55 గంటలకు అమీన్‌పీర్ దర్గా చేరుకుంటారు. 2.00 నుంచి 2.30 గంటల వరకు దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తారు. 2.30 గంటలకు దర్గా నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 2.45 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 2.55 గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 3.35 గంటలకు గన్నవరం వెళతారు.

కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు

కడప అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 30న అమీన్‌పీర్ దర్గా (పెద్ద దర్గా) పర్యటన నేపథ్యంలో దర్గా పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పలు సూచనలు చేశారు. ఎయిర్‌పోర్ట్ నుంచి పెద్ద దర్గా వరకు కాన్వాయ్ రిహార్సల్ నిర్వహించారు. భద్రతను కట్టుదిట్టం చేయాలని , ఎస్పీ ఆదేశించారు.

ఖర్చు తక్కువ.. లాభం ఎక్కువ

- పొట్టేళ్ల పెంపకంపై రైతుల ఆసక్తి
- ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- రెండు జిల్లాలో మొదలైన షీపింగ్ ఫామ్స్



షెడ్డు లోపల పొట్టేళ్ల పెంపం చేపట్టిన దృశ్యాలు



మధ్యాహ్నం వారి పల్లెలో ఆధునిక పద్ధతిలో ఏర్పాటు చేసుకొన్న పొట్టేళ్ల పెంపకం షెడ్డు

సాక్షి, కడప డెస్క్: వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో రైతులు ఇప్పుడిప్పుడే పొట్టేళ్ల పెంపకం వైపు మొగ్గు చూపిస్తున్నారు. తక్కువ ఖర్చుతో నిలకడైన అధిక ఆదాయం వస్తుండడంతో రైతులు రెండుజిల్లాల్లో పొట్టేళ్ల పెంపకం ఫామ్స్‌ను ప్రారంభించారు.ఇందుకోసం ప్రభుత్వం సాయం అందిస్తోంది.కాలానుగుణంగా సులభ పద్ధతిలో తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం వచ్చే రంగంవైపు రైతులు ఆసక్తి చూపిస్తున్నారనేందుకు పొట్టేళ్లపెంపకం ఒక మంచి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

తక్కువ ఖర్చుతో పొట్టేళ్ల షెడ్లు ఏర్పాటు

ఇతర వాటితోపోల్చుకుంటే పొట్టేళ్ల పెంపకం షెడ్ల ఖర్చు తక్కువగా ఉంది. 26 వెడల్పు,62 పొడవుతో ఏర్పాటు చేసే షెడ్డులో 100 నుంచి 120 పొట్టేళ్లు పెంచుకోవచ్చు. ఇందుకోసం అయ్యే ఖర్చు షెడ్ల రకాలను బట్టి ఉంటుంది. కింద ఖాళీ స్థలం వదిలి పైన అయిదు అడుగుల ఎత్తులో ఆధునిక పద్ధతుల్లో ఏర్పాటు చేసుకొనే షెడ్డుకు రూ. 15 లక్షల వరకు ఖర్చు వస్తుంది. ఈ రకం షెడ్డు నిర్వహణకు ఒక మనిషి అయినా సరిపోతాడు. కోళ్ల ఫామ్స్‌లాగా నేలపై ఇదే కొలతలతో ఏర్పాటు చేసుకొనే షెడ్డుకు రూ. 4 నుంచి 5 లక్షల వరకు ఖర్చు వస్తుంది. ఈరకం షెడ్డు నిర్వహణ కోసం ఇద్దరు నుంచి ముగ్గురు మనుషుల అవసరం ఉంటుంది.

3 నుంచి 4 నెలల పొట్టేళ్లతో పెంపకం ప్రారంభం

కొత్తగా ప్రారంభించే షెడ్లలో ముందుగా 3 నుంచి 4 నెలల వయస్సున్న పొట్టేలు పిల్లలను మాత్రమే పెంపకం కోసం తీసుకొస్తారు. అప్పటి నుంచి సుమారు ఆరునెలల పాటు వీటని షెడ్లలోనే పెంచుతారు. ఎక్కువ మనుషులు ఉండే షెడ్లలో అయితే ఆరుబయట పొలాల్లో కూడా మేపుకొనే అవకాశం ఉంటుంది. మొత్తం 8 నుంచి 10 నెలల వయస్సు వచ్చే వరకు పొట్టేళ్లను పోషించి తర్వాత విక్రయిస్తుంటారు. వ్యాపారులు నేరుగా ఫామ్స్ వద్దకే వచ్చి కొనుగోలు చేసుకొని వెళుతుంటారు. వీటికి మార్కెటింగ్ సౌకర్యంకూడా చాలా సులభతరంగా ఉంటుంది.

మూడు ఎకరాల్లో గడ్డిపెంపకం

వంద పొట్టేళ్ల పెంపకం చేపట్టాలంటే కనీసం ఒక రైతు మూడు ఎకరాల్లో గడ్డిపెంపకం చేపట్టాల్సి ఉంటుంది. ఇతర ఆకుతోటలు పెంచాల్సి ఉంటుంది. ఇందులో మన రకం గడ్డితో పాటు ఆస్ట్రేలియన్ రెడ్‌నేపియర్ రకం ఎరుపు రంగులో ఉండే గడ్డి, పెసరట్టు గడ్డి, స్మార్ట్‌నెపియర్ , బుల్లెట్ నేపియర్, ఆవిశాకు రకాన్ని సాగు చేస్తుంటరు. వీటితో పాటు ఎండు వేరుశనగ పొట్టు, మొక్కజొన్న గింజలు,ఫీడ్, బియ్యంతో ప్రతి రోజు పౌష్టికాహారం అందిస్తుంటారు. అన్నింటిని కలిపి ఒక పొటేలుకు సగటున ప్రతి రోజు ఎనిమిది నుంచి 10 కిలోలు ఆహారం అందిస్తుంటారు.

80కిలోల బరువున్న పొట్టేళ్లు లభ్యం

కొత్తగా ప్రారంభించిన పొట్టేళ్ల ఫామ్స్‌లో అత్యధికంగా 80కిలోల బరువున్న పొట్టేళ్లు కుడా లభ్యమవుతుండడం గమనార్హం. సాధారణంగా ఒక పొట్టేలు బరువు 20 నుంచి అత్యధికంగా 30 కిలోలు ఉంటుంది. అయితే ఫామ్స్‌లో పెంచే పొట్టేళ్లు మంచి శరీర సౌష్టవం కలిగి 60 నుంచి 80 కిలోల బరువు కూడా పెరుగుతుంటాయి. 80కిలోల బరువున్న పొట్టేళ్లు మార్కెట్లో రూ. 40 వేలు నుంచి రూ.45 వేల వరకు ధరలు పలుకుతుంటాయి.

రంజాన్,బక్రీద్ పండుగలకు ప్రత్యేకం

పొట్టేళ్ల పెంపకం ఫామ్స్‌లో రంజాన్, బక్రీద్ పండుగల కోసం కొన్ని చోట్ల ప్రత్యేకంగా పొట్టేళ్లను పెంచుతున్నారు. పండుగ సమయాల్లో అత్యధిక ధరలకు వీటిని వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. పండుగలకు నెల రోజులకు ముందే వ్యాపారులు ఫామ్స్ దగ్గరకెళ్లి పొట్టేళ్లను మార్కెట్ ధర కంటే ఎక్కువ ధరలకు కొనుగోలు చేస్తుంటారు. పండగల సమయాల్లో విక్రయించడానికే రైతులు ప్రత్యేకంగా 60 నుంచి 80 కిలోలు ఉన్న పొట్టేళ్లను పెంచుతుండడం విశేషం.

ప్రభుత్వ సాయం

జగనన్న ప్రభుత్వం పొట్టేళ్ల పెంపకం కోసం రైతులకు ప్రత్యేక రాయితీలు ఇస్తోంది. ఇటీవల జిల్లాకేంద్రాల్లో వీటిపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. రూ. 10 లక్షల నుంచి రూ. కోటి వరకు రుణాలను ప్రభుత్వం పొట్టేళ్ల పెంపకం కోసం ఇస్తోంది. అందులో బ్యాంకు రుణం 50 శాతం కాగా ప్రభుత్వం నేరుగా రైతుకే 50 శాతం సబ్సీడీ అందజేస్తోంది. దీంతో పొట్టేళ్ల పెంపకంపై ఆసక్తి చూపిస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులతో పాటు మోతుబరి రైతులు కుడా వీటిపై మొగ్గు చూపిస్తుండటం గమనార్హం.

నెలకు రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల ఆదాయం



రైతులకు సరాసరి వంద పొట్టేళ్లకు నెలకు రూ. లక్ష నుంచి రూ. 1.20 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. 3 నుంచి నాలుగునెలల వయస్సున్న పొట్టేలు పిల్ల జాతి రకాన్ని బట్టి రూ. 7 వేల నుంచి 9 వేల వరకు ధర పెట్టి రైతులు కొనుగోలు చేస్తుంటారు. 5 నుంచి ఆరునెలల పాటు ఫారమ్‌లో పెంచిన తర్వాత అదే పొట్టేలును ఒక్కొక్కటి రూ. 14 వేల నుంచి రూ. 16 వేల వరకు విక్రయిస్తుంటారు. పొట్టేళ్ల ఫారమ్‌లోనే తూకాలు వేసి అమ్ముతుంటారు. బతికున్న పొట్టేళకు కిలో రిటైల్ ధర రూ. 550 వరకు హోల్‌సేల్ ధర అయితే రూ.450 నుంచిరూ.500 వరకు విక్రయిస్తుంటారు. ఈలెక్కన వంద పొట్టేళ్ల పెంపకంతో సరాసరి నెలకు రైతుకు రూ. 1 లక్ష నుంచి రూ. 1.20 లక్షల ఆదాయం వస్తుంది.

పొట్టేళ్ల పెంపకంతో లాభమే



రెండేళ్లుగా పొట్టేళ్ల పెంపకం ఫామ్స్ నిర్వహిస్తున్నాం. మంచి లాభాలు వస్తున్నాయి. మిగతా వాటితో పోలిస్తే నిర్వహణ భారం చాలా తక్కువ. నష్టం రాని వ్యాపారం. మనకు ఎప్పుడు కావాలంటే అప్పుడు పొట్టేళ్లను అమ్ముకొనే అవకా శం ఉంది. మూడు నుంచి నాలుగునెలల కా లం పాటు పొట్టేళ్లను పోషిస్తే మార్కెట్లో మంచి లాభాలకు అమ్ముకోవచ్చు. – అన్వర్, గుర్రంకొండ

మంచి భవిష్యత్తు ఉంది



పొట్టేళ్ల పెంపకంతో రైతులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. తక్కువ పెట్టుబడి పెట్టి నిలకడైన ఆదాయం వచ్చేదే ఈ పొట్టేళ్ల పెంపకం. షెడ్లకు ఎక్కువగా పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేదు. రూ. 5 లక్షలతో వంద పొట్టేళ్లు పెంచి పోషించే షెడ్డు వేసుకోవచ్చు. ఎక్కువ కూలీలు లేకుండా కేవలం ఒక రిద్దరితోనే పొట్టేళ్ల ఫారమ్స్ నడపవచ్చు. ఒత్తిడి తక్కువ. ఎప్పుడు కావాలంటే అప్పుడు మంచి లాభాలకు పొట్టేళ్లను అమ్ముకొనే అవకాశం ఉంది. – వెంకటరమణ, కొత్తపల్లె

ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోంది



పొట్టేళ్ల పెంపకం ఫామ్స్ నిర్వహించే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోంది. గతంలో ఎ న్నడూలేని విధంగా మొత్తం రుణంలో 50 శాతం వరకు సబ్సీడీ ఇస్తోంది. రూ. 10 లక్షల నుంచి రూ. కోటి వరకు పొట్టేళ్ల పెంపెకం షెడ్లపై రుణాలు ఇస్తున్నారు. పాడిఆవులు,కోళ్ల ఫామ్స్‌తో పాటు పొట్టేళ్ల పెంపకాలకూ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. – సునీల్‌కుమార్, పశువైద్యాధికారి, గుర్రంకొండ

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

- మదనపల్లె మండలంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం
- అర్జీలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ
- సమస్యల పరిష్కారంపై తక్షణమే అధికారులకు ఆదేశాలు
- ఆడుదాం ఆంధ్రాలో యువత భాగస్వాములు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్‌అహ్మద్

మదనపల్లె : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మండలాల స్థాయిలోనూ జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ అన్నారు. బుధవారం మదనపల్లె ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మండలస్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జేసీ ఫర్మాన్‌అహ్మద్, ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ, ఎంపీపీ రెడ్డెమ్మ పాల్గొన్నారు. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వివిధ రకాల సమస్యలపై ప్రజలు 107 అర్జీలను అందించారు. ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధించి అక్కడికక్కడే సంబంధిత అధికారులకు జేసీ ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ స్పందన కార్యక్రమానికి మరింత మెరుగ్గా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని తీసుకువచ్చిందన్నారు. వీటితో పాటుగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రతిరోజు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి సోమవారం జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల తహసీల్దార్, మున్సిపాలిటీలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజాసమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండల స్థాయిలో ప్రతి బుధ, శుక్రవారాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నారని తెలిపారు. ప్రతి అర్జీదారుడు తన సమస్యను రాతపూర్వకంగా తెలుపుతూ, దానికి తగిన ఆధారాలను జతపరిస్తే..తక్షణమే అధికారులు పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఐదు క్రీడావిభాగాలైన క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు గ్రామ, వార్డు సచివాలయ స్థాయి నుంచి ఐదు దశల్లో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల్లో యువత భాగస్వామ్యులు కావాలన్నారు. క్రీడాపోటీలకు యువత, అలాగే పోటీలను వీక్షించేందుకు ప్రజలు తమ పేర్లను నమోదుచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ మిద్దింటి ధనలక్ష్మి, డీఎల్‌డీఓ లక్ష్మీపతి, జిల్లావ్యవసాయాధికారి చంద్రానాయక్, డీఎంహెచ్‌ఓ కొండయ్య, చేనేత, జౌళిశాఖ ఏడీ శ్రీనివాసులురెడ్డి, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, కమిషనర్ కె.ప్రమీల, ఎంపీడీఓ భానుప్రసాద్, సీడీపీఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాంలో ప్రధాన సమస్యలు..

సీటీఎం-1 పంచాయతీలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని, షెడ్యూల్ కులాలు, తెగలకు చెందిన ప్రజలు సమావేశాలు నిర్వహించుకునేందుకు అంబేడ్కర్ భవనం నిర్మాణం జరపాలని, సీటీఎం పెద్దచెరువుకు హంద్రీనీవా కాలువ నుంచి నీటిని తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రెడ్డెమ్మ, సర్పంచ్ ఆనందపార్థసారధి, వెలుగుచంద్ర అర్జీలు సమర్పించారు. ఇంకా పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

క్లుప్తంగా

రక్షిత మంచినీటి పథకం పైప్‌లైన్ ధ్వంసం

రామాపురం : పాత రామాపురంలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన పైపులైన్, స్టార్టర్, గేటువాల్వ్‌లను ధ్వంసం చేసినట్లు గ్రామ సర్పంచ్ అయోధ్యపురం నాగభూషణ్‌రెడ్డి, జెడ్పీటీసీ మాసన వెంకటరమణ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాగునీటి సమస్య తీర్చేందుకు గ్రామంలోని మూడు రక్షిత మంచినీటి పథకాల బోర్లను ఏర్పాటు చేశారు. ఈ బోర్లకు పైపులైన్లు, గేటువాల్వ్, స్టార్టర్లను అమర్చారు. గుర్తు తెలియని ఆకతాయిలు వీటిని ధ్వంసం చేశారు. లక్కిరెడ్డిపల్లె సీఐ గంగాధర్ బాబు, ఏఎస్ఐ శ్రీనివాస్ శర్మ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నష్టం సుమారు రూ.30వేలు వరకు ఉంటుంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన గోపాల్‌రెడ్డి కుమారుడు జి.రెడ్డి(23), తల్లిదండ్రులపై అలిగి మంగళవారం రాత్రి ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. అదే విధంగా మదనపల్లె మండలం చీకలబైలుకు చెందిన రెడ్డిశేఖర్ భార్య జి.మమత(28) కుటుంబ సమస్యల కారణంగా బుధవారం ఉదయం ఇంట్లోనే పురుగుల మందు తాగింది. ఆయా ఘటనల్లో కుటుంబ సభ్యులు బాధితుడిని 108 వాహనం అంబులెన్స్ ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన అబ్దుల్

కలకడ : ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై కలకడ మండలం బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లె వద్ద జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కలకడ ఇందిరమ్మ కాలనీకి చెందిన అబ్దుల్ తన టీవీఎస్ ఎక్సెల్‌లో కాలనీ నుంచి కలకడకు వస్తుండగా తన ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతని తలకు, శరీరంపై తీవ్ర రక్తగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎంఐజీ ప్లాట్లకు దరఖాస్తు చేసుకోండి

ప్రొద్దుటూరు : స్థానిక రింగ్ రోడ్డు సమీపంలో కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఎంఐజీ ప్లాట్ల కోసం డిసెంబర్ 2వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కుడా వైస్ చైర్మన్ ఓబులేసు నందన్ తెలిపారు. 44.30 ఎకరాల విస్తీర్ణంలో జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ ద్వారా నిర్మిస్తున్న ఈ లేఅవుట్‌కు సంబంధించి జూలై 21వ తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. డిసెంబర్ 2లోపు 10 శాతం మొత్తం డబ్బు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. 7న లాటరీ ద్వారా దరఖాస్తుదారులకు ప్లాట్లను ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు హెచ్‌టీటీపీఎస్://ఎంఐజీఏపీడీటీఈపీ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

రూ.1600 కోట్లతో రైల్వేకోడూరు అభివృద్ధి

ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : వైఎస్ జగన్ పాలనలో రైల్వేకోడూరు నియోజకవర్గంలో రూ.1600 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్టు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమశిల బ్యాక్ వాటర్‌ను పెనగలూరు, చిట్వేలి మండలాల్లో రెండు లిఫ్టులతో 18 చెరువులకు సాగునీరు, తాగునీరు అందించేందుకు రూ.215.25 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసిందన్నారు. ఈ నీటి ద్వారా 10వేల హెక్టార్ల ఆయకట్టుకు సాగునీటిని అందించవచ్చన్నారు. అలాగే ప్రతి ఒక్క గ్రామ పంచాయతీకి తాగునీరు పుష్కలంగా అందుతుందన్నారు. మొత్తం 39 కిలోమీటర్ల మేర సోమశిల బ్యాక్‌వాటర్ సాగుతుందన్నారు. అలాగే రైల్వేకోడూరు, చిట్వేలి మధ్య 26 కిలోమీటర్ల మేర రూ.40 కోట్లతో డబుల్ రోడ్డు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. దీంతో చిట్వేలి గ్రామాల దశాబ్దాల కల నెరవేరినట్లేనన్నారు. అలాగే గుంజన నదికి రక్షణగోడ లేకపోవడంతో వర్షాలు అధికంగా కురిసినప్పుడు చుట్టు పక్కల ఇళ్లు, పాఠశాలల్లోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడేవారన్నారు. అందుకు 50 కోట్ల రూపాయలతో గుంజన నదికి రక్షణ గోడను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.11 కోట్లతో కోడూరులో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించామని తెలిపారు. కోడూరులో ఇప్పటికే రూ.10 కోట్లతో నూతనంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. రాబోయే నాలుగు నెలల్లోనే నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. ముఖ్యంగా రైల్వేకోడూరు నియోజకవర్గంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని చెప్పారు. వైఎస్ జగన్‌ను ప్రాంత ప్రజలు చిరకాలం గుర్తు పెట్టుకుంటారని పేర్కొన్నారు.

టీడీపీ నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు

టీడీపీ నాయకులను రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం నుంచి ప్రజల దృష్టి మళ్లించేలా అబద్దపు హామీలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పేదలు ఆర్థికంగా ఎదిగినప్పుడే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని సీఎం జగన్ నమ్మకం అన్నారు. న్యాయంగా, అవినీతికి తావులేకుండా కులం, మతం, వర్గం, పార్టీలకు అతీతంగా పారదర్శకంగా అర్హులైన అందరికి సంక్షేమ ఫలాలు అందాలన్నదే ముఖ్యమంత్రి సంకల్పమన్నారు. అందుకే ప్రతి గడపకు ధైర్యంగా వెళ్లి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని అడుగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఏపీటీడీసీ చైర్మన్ సాయికిషోర్ రెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, బండారు మల్లికార్జున, వెంకటరెడ్డి, క్రిష్టారెడ్డి, గురువులు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధురాలి మృతి



లక్ష్మీదేవమ్మ (ఫైల్)

మదనపల్లె : ట్రాక్టర్ రివర్స్ చేస్తుండగా వృద్ధురాలిని ఢీకొనడంతో ఆమె మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు...కొత్తవారిపల్లె పంచాయతీ పాళెంకొండకు చెందిన గుర్రప్ప భార్య కె.లక్ష్మీదేవమ్మ(75) ఇంటి ముందు అరుగుపై రాత్రి 9.30 గంటల సమయంలో కూర్చుని ఉండగా, వీధి కుక్కలు పెద్దగా అరుస్తూ స్థానికులపై కరిచేందుకు ఉరికాయి. అదే సమయంలో లక్ష్మీదేవమ్మ మనవడు బాలాజీ స్థానికుల అభ్యర్థన మేరకు తమ సొంత ట్రాక్టర్‌ను రివర్స్ చేసి దారికి అడ్డంగా ఉంచి వీధి కుక్కలగుంపును అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. అందులో భాగంగా ట్రాక్టర్ వెనక్కి నడవడంతో అదుపుతప్పి ఒక్కసారిగా అరుగుపై కూర్చున్న వారిపైకి దూసుకెళ్లింది. అక్కడున్న వారు ప్రమాదం నుంచి తప్పించుకోగా, వృద్ధురాలు లక్ష్మీదేవమ్మపై ట్రాక్టర్ వెళ్లడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. వెంటనే కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని మార్చురి గదికి తరలించారు. మృతురాలు లక్ష్మీదేవమ్మ కుమారుడు శంకరప్ప ఫిర్యాదు మేరకు తాలూకా ఎస్.ఐ సుధాకర్ ఆదేశాలతో ఏఎస్ఐ సుబ్రమణ్యం కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కుటుంబ సభ్యులు ట్రాక్టర్ రివర్స్ చేస్తుండగా గోడ తగిలి మీదపడటంతో లక్ష్మీదేవమ్మ మృతి చెందినట్లు పేర్కొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా రూపకల్పన

రోల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న రోల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : ఓటర్ల జాబితాలో పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా రూపొందించాలని జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల దృష్ట్యా అధికారులు మరింత శ్రద్ధ వహించాలన్నారు. పని ఒత్తిడి ఉన్నప్పటికీ ఓటరు జాబితా రూపకల్పనలో ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు తప్పక పాటించాల్సిందేనన్నారు. 18 ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. బీఎల్‌ఓలు క్షేత్ర స్థాయిలో 30-40 శాతం మాత్రమే ఇంటింటి పరిశీలన చేశారనే ఫిర్యాదులు ఉన్నాయని పేర్కొన్నారు. మిగిలిపోయిన ఓటర్ల జాబితాను పరిశీలించాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు తమ ఫిర్యాదులను ముందుగానే అందజేయాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు మాట్లాడుతూ దరఖాస్తుల పరిశీలన మరోసారి చేపడతామన్నారు. ఇందుకోసం వచ్చే వారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నవశకం

విద్యావ్యవస్థకు ప్రాధాన్యత



గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యా వ్యవస్థకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయం. నాడు-నేడు పనులతో అత్యాధునిక భవనాలు, మరుగుదొడ్లు, ఆర్‌ఓ ప్లాంట్లు, మౌలిక సదుపాయాలు కల్పించారు. విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య ప్రభుత్వ బడుల్లోనే అందుతోంది. జగనన్న విద్యా కానుక విద్యార్థులకు వరం లాంటిది. డిజిటల్ విద్యాబోధన విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. - నటరాజ, హెచ్‌ఎం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పీలేరు.

సొంతింటి కల సాకారం



రజక వృత్తి చేసుకుంటేనే మా జీవనం సాగుతుంది. కనీసం సెంటు స్థలం కూడా కొనుక్కోలేని పరిస్థితి. గతంలో చాలా సార్లు ఇంటి స్థలం కోసం అర్జీలు పెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. జగన్ వచ్చిన తర్వాత ఆఫీసుల చుట్టూ తిరగకుండానే నాకు ఇంటి స్థలం, ఇల్లు మంజూరైంది. ఇప్పుడు నేను ఇల్లు నిర్మించుకుంటున్నాను. జగన్ పుణ్యమా అని నాకు ఒక గూడు దొరికింది.

- నాగమునెమ్మ, తుమ్మల అగ్రహారం, రాజంపేట మండలం

జగనన్న సురక్షతో ఉచితంగా సర్టిఫికెట్లు



గతంలో ఆదాయ, కుల, జనన ధ్రువీకరణ సర్టిఫికెట్ల కోసం ఎంఆర్‌ఓ కార్యాలయానికి కాళ్లు అరిగేలా తిరిగేవాళ్లం. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వలంటీర్లు గ్రామ సచివాలయంలోనే కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్లు అందించారు. మాకు ఉచితంగా సర్టిఫికెట్లు అందజేసి ఆఫీసుల చుట్టూ తిరగకుండా చేసి జగనన్న దేవుడయ్యాడు. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాము.

- జాలా కృష్ణవేణి, జీఎంఆర్ కాలనీ, మద్దిరేవుల గ్రామం, లక్కిరెడ్డిపల్లె మండలం

ఐక్యతతోనే రాజ్యాధికార సాధన



మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు

రాయచోటి అర్బన్ : బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఐక్యతతో పోరాటం చేయడం ద్వారానే రాజ్యాధికారాన్ని సాధించుకోవచ్చని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ చైతన్యం లేని కారణంగా రాష్ట్రంలో 80 శాతం జనాభా కలిగిన బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిపోయారన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి దువ్వూరు నరసింహాచారి మాట్లాడుతూ అందరూ విద్యావంతులు కావడం ద్వారానే చైతన్యం సాధ్యమన్నారు. సమావేశంలో రాష్ట్ర వడ్డెర సంఘం నేత ఇడగొట్టు నాగేశ్వరరావు, దూదేకుల సంఘం నాయకుడు పాలగిరి హబీబుల్లా, కురుబ సంఘం నాయకుడు ఈశ్వరయ్య, నాయకులు గోవిందు, రామాంజి, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేరదీసి.. కుటుంబ సభ్యులకు అప్పగించి

- మతిస్థిమితం లేక ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళ
- రెండేళ్ల తరువాత ఇంటికి చేరిన వైనం

ప్రొద్దుటూరు కల్చరల్ : విశాఖపట్నంలో మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్న ఓ మహిళను అక్కడి బ్యానియన్ ఆర్గనైజేషన్ వారు చేరదీశారు. ఆమెకు వైద్య సేవలు అందించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలు ఇలా.. ప్రొద్దుటూరు మండలం అమృతానగర్‌కు చెందిన టంగుటూరు సరోజ ఆశ(52) అనే మహిళ రెండేళ్ల క్రితం మతిస్థిమితం కోల్పోయి ఇల్లు వదలి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు గాలించినా ఆమె ఆచూకీ దొరకలేదు. ఎక్కడెక్కడో తిరిగి చివరకు ఆమె విశాఖపట్టణానికి చేరుకుంది. ఆమెను గమనించిన బ్యానియన్ ఆర్గనైజేషన్ వారు ఆమెను చేరదీశారు. చికిత్స అందించడంతో కోలుకుని గతం గుర్తుకు వచ్చింది. దీంతో సరోజ తనను ప్రొద్దుటూరులోని కుటుంబ సభ్యుల వద్దకు చేర్చమని ఆర్గనైజేషన్ వారిని కోరింది. వారు ప్రొద్దుటూరులోని ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణను సంప్రదించారు. ఆర్గనైజేషన్ వారు చెప్పిన వివరాల మేరకు ఆయన వారం క్రితం అమృతానగర్‌లోని 13వ వీధికి వెళ్లి విచారించారు. కుటుంబ సభ్యులను ఫోన్‌లో సరోజతో మాట్లాడించారు. రెండేళ్లుగా ఎన్నిచోట్ల గాలించినా ఆచూకీ దొరకని సరోజ తన అమ్మ అమ్మణ్ణెమ్మ, కొడుకు ప్రశాంత్‌లను గుర్తుపట్టి మాట్లాడటంతో వారి సంతోషానికి అవధులు లేకుండా పోయింది. ఎట్టకేలకు బ్యానియన్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు సరోజ ఆశను విశాఖపట్నం నుంచి తీసుకువచ్చి బుధవారం ఆమె కుటుంబీకులకు అప్పగించారు. ఈమె భర్త టంగుటూరు చిన్న అన్నయ్య కువైట్‌లో ఉన్నారు. ఆయనతో పాటు, కుటుంబ సభ్యులు వైజాగ్ బ్యానియన్ ఆర్గనైజేషన్ వారికి, ప్రొద్దుటూరు ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.



కుటుంబ సభ్యులు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో సరోజ ఆశ

రిమ్స్ వైద్యకళాశాల అధికారుల బదిలీ



డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ శ్రీనివాసనాయక్

కడప అర్బన్ : ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల (రిమ్స్)లో వైస్ ప్రిన్సిపాల్స్‌గా పని చేస్తున్న డాక్టర్ కె. వరలక్ష్మి పులివెందుల మెడికల్ కళాశాలకు, డాక్టర్ ఎం. శ్రీనివాసనాయక్ ఆదోని మెడికల్ కళాశాలకు బదిలీ అయ్యారు. 2020 నుంచి రిమ్స్‌లో వీరు తమ విభాగాల్లో వైద్య సేవలను, పరిపాలన విభాగం సేవలను అందించారు. వీరిలో డాక్టర్ వరలక్ష్మి పెథాలజీ హెచ్‌ఓడీగా పనిచేస్తూనే ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా, అడ్మిన్ వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. డాక్టర్ శ్రీనివాసనాయక్ ఫోరెన్సిక్ హెచ్‌ఓడీగా, వైస్ ప్రిన్సిపాల్ (అకడమిక్)గా తమ సేవలను అందించారు.

నీటి గుంతలో పడి వృద్ధుడు మృతి



మృతి చెందిన వృద్ధుడు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఎర్రగుంట్ల రోడ్డులోని భారత్ హాల్ వెనుక వైపున గల నీటి గుంతలో పడి వృద్ధుడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. వృద్ధుడికి సుమారు 70 ఏళ్లు ఉంటాయని, గత నాలుగు రోజులుగా అదే ప్రాంతంలో పాత ఇనుప సామాన్లు ఏరుకుంటూ ఉండేవాడని స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం నీటి గుంతలో పడి మృతి చెందాడన్నారు. స్థానికులు చెప్పిన వివరాల ఆధారంగా అతను ప్రొద్దుటూరు మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన పుల్లయ్యగా భావిస్తున్నారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచారు. మృతుడి గురించి సమాచారం తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ శ్రీకాంత్ తెలిపారు.

యువకుడు అదృశ్యం



మొరపిండి వరుణ్ (ఫైల్)

రాజుపాళెం : రాజుపాళెం మండలం పొట్టిపాడు గ్రామానికి చెందిన మొరపిండి వరుణ్ (23) అనే యువకుడు ఈనెల 26వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆ యువకుడి తల్లి గోవిందమ్మ బుధవారం రాజుపాళెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వరుణ్‌కు ఇంకా వివాహం కాలేదు. ఇతను గ్యాస్ ఏజెన్సీలో పనికి వెళుతున్నాడు. అయితే గత మూడు నెలలుగా ఆ పని మానేసి వ్యవసాయ కూలి పనులకు పోయేవాడు. గత మూడు రోజులుగా కనిపించకపోవడంతో తల్లి గోవిందమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాజుపాళెం ఏఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన టీడీపీ నాయకులు

వేంపల్లె : మండలంలోని ముతుకూరు గ్రామంలో బుధవారం 40 కుటుంబాల వారు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. తుపాకుల గంగిరెడ్డి, తుపాకుల బాబురెడ్డి, తుపాకుల సూర్యనారాయణరెడ్డి, తుపాకుల రామగంగిరెడ్డి, జడ మహేశ్వరరెడ్డి, ఆసం పరమేశ్వరరెడ్డి, తుపాకుల జయచంద్రారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, ఉత్తమారెడ్డి, సుబ్బారెడ్డి, జడ రామకృష్ణారెడ్డి, గంగాధరరెడ్డి, శివారెడ్డి, నాగేశ్వరరెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, రామిరెడ్డి, ఈశ్వరరెడ్డిలతోపాటు 40 కుటుంబాల వారికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీలో చేరిన వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న పాలన, సంక్షేమం, అభివృద్ధిని చూసి పార్టీలో చేరామన్నారు. టీడీపీ హయాంలో సంక్షేమ పథకాలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీ గాయత్రి, సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మోడల్ కెరీర్ సెంటర్ ప్రారంభం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మోడల్ కెరీర్ సెంటర్ సేవలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజయరామరాజు పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ ఓ బ్లాక్‌లో రూ.30 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో మోడల్ కెరీర్ సెంటర్‌గా ఆధునీకరించిన జిల్లా ఉపాధి కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, మునిసిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్, జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్, సహాయ ఉపాధి అధికారి హెచ్.దోనప్ప, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి, బీసీ వెల్ఫేర్ అధికారి బ్రహ్మయ్య, వ్యవసాయ శాఖ జేడీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.